# విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

- పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకే అల్పాహారం పథకం ప్రారంభం
- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్


మందమర్రిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మందమర్రి, అక్టోబర్ 6: తెలంగాణలో విద్యాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రత్యేక కృషి చేస్తున్నారని అందుకు విద్యా వ్యవస్థలో అనేక మార్పులకు రూపకల్పన చేస్తూ వాటిని అమలు పరుస్తున్నారని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. మందమర్రి పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఒకటి, రెండు, మూడవ జోన్ ఏరియాల్లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తారు రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రాణహిత కాలనీ సమీపంలో గల సమ్మక్క-సారలమ్మ మహిళా భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో విప్ సుమన్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు మన ఊరు- మన బడి పథకాన్ని అమలు చేశారని తెలిపారు. విద్యార్థుల ఆకలిని తీర్చి వారిలో చదువుపై ఏకాగ్రతను పెంపొందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ స్వయంగా అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ఈ ప్రాంతంలో గతంలో తనకన్న ముందు అనేక మంది ఎమెల్యేలు, మంత్రులు పని చేశారని తన హయాంలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడన్న జరిగిందా అని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నికలు రాగానే మాయమాటలు చెప్పే వారు వస్తారని, వారి మాటలకు ఆగం కావద్దని, ప్రజలకు అండగా ఉండే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం నింపేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా చీరెలను అందిస్తున్నదని తెలిపారు. మందమర్రి మున్సిపాలిటీలో వందలాది కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. అందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. మున్సిపాలిటీలో సింగరేణి సహకారంతో కూడా మరికొన్ని అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. పట్టణంలోని ఒకటి, రెండు, మూడవ జోన్ ఏరియాల్లో 4.09 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్ల నిర్మాణం పనులకు విప్ సుమన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు వేల్పుల రవి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్ ప్రభాకర్ రావు, జడ్పీ సీఈవో కే.నరేందర్, డీఈవో ఎస్ యాదయ్య, ఎంఈవో జాడి పోచయ్య, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో శశికళ, సింగరేణి మందమర్రి ఏరియా జీఎం ఏ.మనోహర్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్‌సుందర్, సివిల్ ఎస్ఈ జయప్రకాశ్, ఎస్ఎస్‌వో రవి, డీవైపీఎం ఎండీ ఆసీఫ్, ప్రజాప్రతినిధులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి పర్యటనను విజయవంతం చేయండి


ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నాయకురాళ్లు

చెన్నూర్, అక్టోబర్ 6: చెన్నూర్‌లో శనివారం జరుగనున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలో మంత్రి హరీశ్‌రావు పర్యటనలో పాల్గొనాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

**భీమారంలో..**

భీమారం, అక్టోబర్ 6 : చెన్నూర్ పట్టణంలో నిర్వహించే మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తమరెడ్డి పేర్కొన్నారు. భీమారం మండల కేంద్రంలో పలువురి మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ బాల్కసుమన్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

**చెన్నూర్ మండలంలో..**


దుగ్నెపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ మోతె తిరుపతి

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 6: చెన్నూర్ పట్టణంలో శనివారం జరిగే మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని చెన్నూర్ జడ్పీటీసీ మోతె తిరుపతి, ఎంపీపీ మంత్రి బాపు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి తెలిపారు. సంకారం, కిష్టంపేట, కొమ్మెర, దుగ్నెపల్లి, నాగాపూర్, ఆస్నాద్, పొక్కూర్, ముత్తరావుపల్లి, ఓత్కులపల్లి గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ప్రచారం చేశారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తమరెడ్డి


క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

భీమారం, అక్టోబర్ 6 : యువతకు సీఎం కేసీఆర్ సర్కారు అండగా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తమరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి క్రీడాకారులకు క్రీడా సామగ్రి రాగా వాటిని సర్పంచ్ గద్దె రాంరెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడా కారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ బాబర్ ఖాన్, మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్ కుమార్ నాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కోటపల్లిలో..**


కోటపల్లిలో యువకులకు కేసీఆర్ క్రీడా కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సురేఖ

కోటపల్లి, అక్టోబర్ 6 : కోటపల్లి మండల కేంద్రంలోని యువకులకు ఎంపీపీ మంత్రి సురేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ బైస ప్రభాకర్ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. రాంపూర్, వెలమపల్లి గ్రామాల్లో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాగం రాజక్క, పిల్లి భారతి, సత్యనారాయణ రావు, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, కోట శ్యామల, తనుగుల శైలజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నస్పూర్‌లో గంజాయి పట్టివేత

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 6: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫోర్‌లైన్స్ సర్వీస్ రోడ్డు వద్ద తనిఖీ చేపట్టారు. మంచిర్యాల రాజీవ్‌నగర్ నుంచి గోదావరిఖని వెళ్తున్న ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో తరలిస్తున్న కిలో డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని, షేక్ షాహిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.25వేలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసి గోదావరిఖని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. స్టూడెంట్లు, యువకులకు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపాడని అన్నారు. షేక్ షాహిద్‌తో గంజాయిని సీసీసీ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు.

## బతుకమ్మ చీరెల పంపిణీ


కోటపల్లి : చీరెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఏఎంసీ వైస్ చైర్మన్

కోటపల్లి, అక్టోబర్ 6 : ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరెలను కోటపల్లి మండలకేంద్రంలో ఎంపీపీ మంత్రి సురేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ బైస ప్రభాకర్ పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని పండుగలను సమానంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజలింగు, సర్పంచ్ రాగం రాజక్క, నాయకులు పాల్గొన్నారు.

**భీమారంలో..**


భీమారం : చీరెలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

భీమారం, అక్టోబర్ 6 : బతుకమ్మ చీరెలను మహిళలకు భీమారంలోని స్థానిక రావి చెట్టు వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తమరెడ్డి, నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వంబర్, సర్పంచ్ గద్దెరాంరెడ్డి, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్యా రాజ్ కుమార్ నాయక్, డీలర్లు సంతోష్, భాస్కర్ రెడ్డి, పోడెటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబీమా అందజేత


రైతుబీమా మంజూరు పత్రం అందజేస్తున్న సర్పంచ్

కోటపల్లి, అక్టోబర్ 6 : కోటపల్లి మండలంలోని సిర్సా గ్రామానికి చెందిన తాటి వెంకన్న ఇటీవల మరణించగా అతని కుటుంబానికి రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5లక్షలను అతని భార్య తాటి లక్ష్మికి సర్పంచ్ పెద్దింటి పున్నం చంద్ అందజేశారు.

## స్త్రీ నిధి రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలి

- డీఆర్డీవో శేషాద్రి


మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

దండేపల్లి, అక్టోబర్ 6 : స్త్రీనిధి రుణాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి శేషాద్రి అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వీవోఏల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలు స్త్రీనిధి రుణాల లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించేలా సీసీలు, సంఘమిత్రలు కీలకపాత్ర పోషించాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లించకపోతే అధిక వడ్డీ పడుతుందన్నారు. ఎంటర్‌ప్రైజెస్ రుణాలపై చర్చించారు.లక్ష్యాలు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ స్వర్ణలత, రమేశ్, ఏపీఎం బ్రహ్మయ్య, టీజీబీ మేనేజర్ అనిల్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకాంత్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అల్లంల అనిత, తదితరులు పాల్గొన్నారు

## ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన యువకుడికి సన్మానం


యువకుడిని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు

కోటపల్లి, అక్టోబర్ 6 : పారుపల్లికి చెందిన కార్తిక్ ఆర్మీ జాబ్‌కు ఎంపిక కాగా బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు, సర్పంచ్ పూరెల్ల వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ నామని రమేశ్, బీఆర్ఎస్ నాయకులు పాలపులపు చంద్రు, గడల చంద్రు, తాళ్లపల్లి వెంకన్న, గడల రామకృష్ణ, డేగల రామ్మూర్తి, దర్ని రవీందర్, పబ్బ రామ్, తాళ్లపల్లి బాపు, బీఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు ఆసంపల్లి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ల పరిశీలన

జన్నారం, అక్టోబర్ 6 : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఫైనల్ ఓటరు జాబితాకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటరు లిస్టును అతికించినట్లు తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. ఓటరు లిస్టులో పేరు ఉన్నదో లేదో చూసుకోవాలని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## ద్రవ రూప యూరియా వాడకంపై అవగాహన

దండేపల్లి, అక్టోబర్ 6: దండేపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నానో ద్రవరూప యూరియా వాడకంపై వ్యవసాయ విస్తీర్ణాధికారి రజిత రైతులకు అవగాహన కలిగించారు. నానో యూరియా ఒక్క బాటిల్ 500 ఎంఎల్ పరిమాణంలో ఉంటుందని, ఇది ఒక్క ఎకరానికి సరిపోతుందని తెలిపారు. ఇది 45కేజీల యూరియా బస్తాతో సమానమని తెలిపారు. రైతులు దీని ద్వారా రవాణా ఖర్చులు తగ్గించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

## డిగ్రీ కళాశాల రెగ్యూలర్ ప్రిన్సిపాల్‌గా జైకిషన్ ఓఝూ

లక్షెట్టిపేట, అక్టోబర్ 6 : పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జై కిషన్ ఓఝూ నియమితులయ్యారు. పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఫిజిక్స్ అధ్యాపకుడు జైకిషన్ ఓఝూను రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషనల్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జై కిషన్ ఓఝూను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.